రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలంలోని మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాధికారులు, సొసైటీ పాలకవర్గం సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



సర్వే వివరాలను సేకరిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: కుటుంబ సమగ్ర సర్వే వివరాల నమోదుకు ప్రజలంతా తమ పూర్తి సహకారం అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర కోరారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యుమరేషన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీ, శ్రీకృష్ణనగర్ కాలనీ, ఫ్రీడం విల్లాస్, ఫార్చ్యూన్ మీడోస్‌లలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలు..!

- గత్యంతరం లేక రోడ్లపైనే పాదచారుల నడక
- అడ్డదిడ్డ పార్కింగ్‌లతో తరచూ ప్రమాదాలు
- నిమ్మకునీరెత్తినట్లుగా సంబంధిత శాఖాధికారుల తీరు



కార్పొరేషన్ పరిధిలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమించి వ్యాపారులు కొనసాగిస్తున్న దృశ్యం





రోడ్లపైనే నిలుపుతున్న వాహనాలు..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన వీటిపై కొందరు అక్రమంగా వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిని పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేన్నట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాదచారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై చిన్నాచితక వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని నడవడానికి వీలులేకుండా ఫుట్‌పాత్‌లను వాడుకుంటున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పోలీస్ అకాడమీ నుంచి టీప్‌కాన్‌పూల్ బ్రిడ్జి వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై భవన నిర్మాణ సామగ్రి అమ్మకాలతో పాటు, పండ్లు పలు చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక పాదచారులు రోడ్డుపైనే నడుస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. సాయంత్రం సమయంలో అడ్డదిడ్డంగా రోడ్లపైనే వాహనాలను పార్కు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఒకవైపు ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికావడమే కాకుండా పీబీఈఎల్ సిటీ వెళ్ళే వాహనదారులు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల వ్యాపారుల వద్దకు వచ్చి కొనుగోలు చేసేందుకు ఆగడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, ట్రాఫిక్ అధికారులకు ఆక్రమణలపై తగుచర్యలు చేపట్టవల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

నామమాత్రంగా తొలగింపులు..

అధికారులు నామమాత్రంగానే ఆక్రమణలను తీసివేస్తున్నారు. అయితే తిరిగి మరునాడే కబ్జాదారులు ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. మున్సిపల్ అధికారలు, ట్రాఫిక్ సిబ్బంది పక్కా ప్రణాళికతో ఫుట్‌పాత్‌ల కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టాలని, పాదచారులకు ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు స్థానికులు, వాకర్స్ కోరుతున్నారు.

స్పీకర్‌ను కలిసిన జల్లపల్లి నరేందర్



శంషాబాద్: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ సోమవారం ఆయన నివాసం వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి కాసేపు మాట్లాడారు. దళితుల అభ్యున్నతి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

రజక బస్తీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని రజక బస్తీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బస్తీవాసులు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బస్తీలో రోడ్లు పూర్తిగా నడిచేందుకు లేకుండా ఉన్నాయని ఈ రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదని, దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. వీధి దీపాలకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన ఉప కమిషనర్ సంబంధిత అధికారులను బస్తీకి పంపించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో శేఖర్, పెండ్యాల శ్రీధర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

చేపల పెంపకంతో ఉపాధి : ఎమ్మెల్యే



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని నర్కూడ శివారులోని మల్లెమోని చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వీటిని వందశాతం రాయితీపై అందజేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న పెండ్యాల సాయి మల్లిక్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. సామాజిక కార్యకర్త పెండ్యాల శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాంపల్లి, ఆరాంఘర్, శంషాబాద్ రోడ్డు, అత్తాపూర్, హైదర్‌గూడ, మెహిదీపట్నం, సరోజినిదేవి కంటి ఆసుపత్రి, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లోని రోడ్డుకిరువైపులా చలితో బాధపడుతూ నిద్రిస్తున్న నిరుపేదలకు ఈ దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సాయి మల్లిక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెండ్యాల శ్రీనివాస్ జయంతి, వర్ధంతి సందర్భంగా నిరుపేదల కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెడ్డి ఫౌండేషన్‌కు 'కాంటినెంటల్' విరాళం



కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్‌ను కలిసిన మణికొండ రెడ్డి ఫౌండేషన్ నాయకులు

మణికొండ: పేదరెడ్డి విద్యార్థుల చదువులకు మణికొండ రెడ్డి ఫౌండేషన్‌కు కాంటినెంటల్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి రూ. 5లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆయనను కలిసిన రెడ్డి ఫౌండేషన్ నాయకులు చేస్తున్న సేవలను అడిగి తెలుసుకుని రెడ్డిలలో ఉన్న పేద విద్యార్థుల చదువులు, దస్తులు తదితర వాటిని సహాయం చేయాలని ఆయన తన వంతుగా విరాళం అందజేశారు. ఇంటర్మీడియట్ ఆపై చదువులు చదువుకునే విద్యార్థులకు అవసరమైన డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులకు ఆరోగ్య సమస్యలు వస్తే కాంటినెంటల్ ఆసుపత్రిలో గోల్డ్ కార్డు ద్వారా రాయితీలతో పాటు తక్కువ ఖర్చుతో అన్ని రకాల చికిత్సలు అందిస్తామన్నారు. సభ్యుల పిల్లలు గ్యాడ్యుయేట్స్ అయితే వారికి ఇంటెన్షిప్స్‌తో శిక్షణ పొందే సౌకర్యాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు రెడ్డి ఫౌండేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికొండ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సుభాష్ చంద్రరెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ అమర్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీరంచెరువు ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు షాదాన్ కాలేజ్, పీరంచెరువు, వసంతీ ఆనంది, ఎంపైర్ ఇన్‌సిగ్నియా విల్లాస్, గిరిధారి అపార్ట్‌మెంట్స్, స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు స్నేహితహిల్స్ ఫేస్-1, 2, రాయలోక్ ఫర్నీచర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, స్టోన్ ఏజ్ అపార్ట్‌మెంట్స్, బోర్డర్ వే హోటల్, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని పావనీ పాటిల్స్, రఘురామ్‌నగర్ కాలనీ, రాధానగర్, నర్సారెడ్డి కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా కోతలు ఉంటాయని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ విద్యుత్ అధికారులు తెలిపారు. గ్రే హౌండ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఎన్ఐఆర్‌డీ, గ్రే హౌండ్స్, మాణిక్యమ్మ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మండల కార్యాలయం, ఈ సేవ, రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వివాహిత అదృశ్యం



నిర్మ (ఫైల్)

రాజేంద్రనగర్: పార్సిల్ తీసుకొస్తానంటూ ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... కిస్మత్‌పూర్ యాదాద్రి కాలనీకి చెందిన నారాయణలాల్, నిర్మ (25)లు దంపతులు. ఇరువురు ప్రైవేటు జాబ్ చేస్తుంటారు. సోమవారం ఉదయం నిర్మ తన భర్త నారాయణలాల్‌కు తనకు కొరియర్‌లో పార్సిల్ వచ్చిందని తీసుకొస్తానంటూ తెలిపి బయటికి వెళ్లింది. మధ్యాహ్నం అయిన ఇంటికి రాకపోవడంతో ఆమె సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా ఫోన్ ఇంట్లోనే ఉంది. స్థానిక పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి

మణికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి సరైన నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆరోపించటం విడ్డూరమని, అదే విషయాన్ని నాలుగున్నర సంవత్సరాల పాటు ఎందుకు విమర్శించలేదని, ఇప్పుడైనా అదే విషయాన్ని కౌన్సిల్‌లో చర్చకు పెట్టి తీర్మానం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాల్యాద్రినాయుడు, షేక్ ఆరీఫ్‌లు పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల సమస్యల పరిశీలన, వాటి పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలు నచ్చే బీఆర్ఎస్‌లో చేరామని వారు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేస్తే ఊరుకోమని వారు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఎం.కిరణ్ కుమార్

రాజేంద్రనగర్: జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని రాఫా ప్రకృతి చికిత్సాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం రోగులకు వైద్య సేవలను అందజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 65 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రకృతి చికిత్స విధానాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లి అవగాహన పరిచేందుకు ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. బుద్వేల్‌లోని రాఫా ప్రకృతి యోగా కేంద్రంలో రోగులకు అవగాహన కార్యక్రమాన్ని ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ప్రకృతి వైద్య మంచి చికిత్స ఉందన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అత్తాపూర్: గ్రూప్-3 పరీక్షల్లో భాగంగా సోమవారం మూడో పేపర్‌తో ముగిసింది. రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 384 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 117 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఆదివారం, సోమవారం జరిగిన పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా సజావుగా జరిగేందుకు అధికారులు గట్టి బందోబస్తు చర్యలను చేపట్టారు. తమలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు మరింత దోహదపడుతుందన్న ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షకు హాజరు అయినట్లు యాదాద్రి భువనగిరి జిల్లాలో పని చేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ వీఎన్ఆర్ నాయక్ డిఫెన్స్ రంగంలో ఉద్యోగం సాధించిన రమేష్ తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు. చీఫ్ అబ్జర్వర్ కృష్ణనాయక్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ స్వర్ణలత, ఫిజికల్ డైరెక్టర్ గాంగ్యా నాయక్, రెవెన్యూ ఉద్యోగులు వెంకటేశ్వర‌రెడ్డి, సునీల్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మమ్మద్ నయీముద్దీన్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతి



డీసీ రవి కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీకాంత్ ముదుమాల తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్మశాన వాటికలో ఉన్న బోర్ చాలా రోజుల నుంచి పని చేయడం లేదని వెంటనే మరమ్మతులు చేయించాలని రాజేంద్రనగర్ గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్ ముదుమాల, యువజన నాయకులు శంకర్, మనోహర్, మహేశ్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శ్మశాన వాటికలో నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు దృష్టికి తీసుకెళ్లగా నూతన బోర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి నూతన బోర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

కుస్తీ పోటీల టైటిల్ విజేతగా సుస్మిత్ పహిల్వాన్



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానం కేంద్రంగా జరిగిన కుస్తీ పోటీలు ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. ఈ 6వ కుస్తీ పోటీలలో టైటిల్‌ను సుస్మిత్ పహిల్వాన్ కైవసం చేసుకున్నాడు. రెండో విజేతగా సాంకేత్ పహిల్వాన్, మూడో విజేతగా మహేందర్ నిలిచారు. ఈ కుస్తీ పోటీలు బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నారగూడెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌరిగే రాజు పహిల్వాన్ అధ్యక్షతన కమిటీ సభ్యులు విజయ్ రౌత్, గురులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అధ్యక్షుడు యాదయ్య ముదిరాజ్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డి, సంతోష్ పహిల్వాన్, బోత్రాజ్ పహిల్వాన్, అభిమన్యు పహిల్వాన్, నాయకులు మల్లేష్ యాదవ్, నల్లింగ్ రమేష్, ఎస్. జయానంద్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కొలన్ జైపాల్‌రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

గోల్కొండ: గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే వారికి పుట్టబోయే పిల్లలు దృఢంగా ఉంటారని గుడిమల్కాపూర్‌లోని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కావ్య అన్నారు. సోమవారం ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మహిళలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుళ్లు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ, అనిల్ తదితరులున్నారు.



గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పూజలో మామిడి నర్సింగ్‌రావు, మామిడి లక్ష్మీభాయ్ తదితరులు

గోల్కొండ: షేక్‌పేట్ ద్వారకానగర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. పి.కేశవ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. మామిడి నర్సింగ్‌రావు గురుస్వామి, కన్నెస్వామి మామిడి లక్ష్మీభాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పడి పూజలో పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పంచశీల భజన మండలి వారి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గురుస్వామి మామిడి ప్రభాకర్, గంటస్వామి మామిడి శ్రీకాంత్, కన్నెస్వామి మామిడి క్రిష్, కన్నెస్వామి మామిడి హర్షాలీ పాల్గొన్నారు.

మనూలో 'డిజిటల్ సెక్యూరిటీ లెర్నింగ్

రాయదుర్గం: డేటా రక్షణ చట్టాలను అర్థం చేసుకోవడం అవసరమని ప్రముఖ న్యాయనిపుణుడు సయ్యద్ హారూన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో, సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ (ఎస్ఎఫ్ఎల్‌సీ డాట్ ఇన్) సహకారంతో 'డిజిటల్ సెక్యూరిటీ లెర్నింగ్' అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా ఉల్లంఘనలు, గోప్యత హక్కులు, ఎలక్ట్రానిక్ పరికరాల శోధన, సీజ్‌ని నియంత్రించే నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపుల నుంచి వినియోగదారులను ఎలా రక్షిస్తాయనే విషయాన్ని ఆయన వివరించారు. ఎస్ఎఫ్ఎల్‌సీ సాంకేతిక నిపుణుడు విఘ్నేష్ మాట్లాడుతూ డిజిటల్ భద్రతకు సంబంధించిన కీలక చట్టపరమైన, సాంకేతిక అంశాలను వివరించారు. వ్యక్తిగత డేటా ఎలా సేకరించబడుతుందో, విశ్లేషించబడుతుందో, దుర్వినియోగం చేయబడుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. డేటా ప్రొఫైలింగ్ అనే ప్రక్రియను ముప్పు మోడలింగ్ కన్‌క్రిప్షన్, సోషల్ మీడియా ఖాతాలను భద్రపర్చడంపై పలు సలహాలను అందించారు. స్పైవేర్, స్టెక్‌వేర్ నుంచి రక్షించే మార్గాలను కూడా వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన 'మనూ' మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ సైబర్‌స్పేస్‌లో పెరుగుతున్న ప్రమాదాల గురించి విద్యార్థులు, అధ్యాపకులకు మరిన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళుతూ కింద పడడంతో తలకు గాయమై మహిళ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటూ బ్యూటీషియన్‌గా పని చేసే అనూష(36) ఆదివారం మేకప్ చేసేందుకు గచ్చిబౌలికి వచ్చింది. రాత్రి 10.30 గంటలకు స్కూటీపై తిరిగి వెళుతుండగా షేక్‌పేట్ ఫ్లై ఓవర్‌పై డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయింది. తలకు గాయం కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన ఏబీవీపీ పీపీఎల్ క్రికెట్ టోర్నీ

మెన్స్ విజేతగా 9 ప్రిడేటర్స్ • విమెన్స్ విజేతగా గల్లీ గాళ్స్



ఏబీవీపీ పీపీఎల్ క్రికెట్ టోర్నీ మెన్స్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిషద్ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ పోటీలు ముగిశాయి. విజేతలకు ఏబీవీపీ హెచ్‌సీయూ నాయకులు బహుమతులను అందించారు. మెన్స్‌విభాగంలో విజేతగా 9 ప్రిడేటర్స్, రన్నరప్‌గా లైగర్స్, విమెన్స్ విభాగంలో విజేతగా గల్లీగాళ్స్, రన్నరప్‌గా సీసీస్ట్రైకర్స్ నిలిచారు. కార్యక్రమంలో విజేత, రన్నరప్ కెప్టెన్లు సుదీప్, శరణ్, సింధూజ, టోర్నీ కోఆర్డినేటర్లు సుదీప్, జ్వాల, సందీప్ వ్యవహరించగా ఎన్ఈసీ సభ్యురాలు ఆయేషా, ప్రతినిధులు గోకుల్, శుక్లా, వసంతరాథోడ్, వైష్ణవి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ కబ్జాలపై స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్, బల్దియా అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోలిచౌకి, సలార్‌జంగ్ కాలనీ, ఫ్లోర్ మిల్-లంగర్‌హౌస్ రోడ్డు, పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వెలిసిన స్టాల్స్‌ను తొలగించారు. సాలార్‌జంగ్ కాలనీ వద్ద ఫుట్‌పాత్‌పై ఇసుక, ఇటుక, కంకరను తొలగించాలని వాటిని అమ్మే వారిని హెచ్చరించారు.